సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం ; 24 ; ఆగస్టు ; 2023



మత్తు వైద్యులొచ్చారు

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి పూర్తిస్థాయిలో మత్తు వైద్యుల నియామకం జరిగింది. దీంతో మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. IIలో ▸



పొగాకు బోర్డు కృషి

వర్జీనియాకు మంచి ధర లభించడంతో రైతులు ఆనందంగా ఉన్నారని, వారి అభివృద్ధికి పొగాకు బోర్డు కృషి చేస్తుందని బోర్డు ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ అన్నారు. IIలో ▸



క్రీడలతో మానసిక ఉల్లాసం

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో క్రికెట్ నెట్‌ను ఆమె ప్రారంభించారు. IIలో ▸

న్యూస్‌రీల్

కర్మాగారాల్లో తనిఖీలు



తణుకులో తనిఖీలు చేస్తున్న అధికారులు

తణుకు: తణుకు పరిసర ప్రాంతాల్లోని పలు కర్మాగారాల్లో ఎస్ఈబీ, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు బుధవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రాసుగర్స్, వాన్‌బరీ, ఫ్లూటస్ కర్మాగారాల్లో ఆర్ఎస్, మిథనాల్ యూనిట్లు తనిఖీ చేసిన అధికారులు సంస్థ యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వలను తనిఖీలు చేశారు. ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ఆర్ఎస్, మిథనాల్ విషయంలో అజాగ్రత్త వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేసి ట్యాంకర్లు దిగుమతి, ఎగుమతి సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఈబీ జిల్లా అధికారి ఏటీవీ రవికుమార్, ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ, తణుకు ఎస్ఈబీ సీఐ ఆర్.సత్యవతి, ఆంధ్రాసుగర్స్ డిస్టిలరీ అధికారి సీహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి వరద స్వల్పంగా తగ్గుతోంది. బుధవారం ఉదయం నుంచి ఎగువ ప్రాంతాల నుంచి తగ్గుముఖం పట్టడంతో క్రమేపీ వరద తగ్గుతోంది. బుధవారం ఉదయం స్పిల్‌వే నుంచి 5,48,608 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. అది సాయంత్రానికి క్రమేపీ తగ్గుతూ స్పిల్‌వే వద్ద 30 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. సాయంత్రం స్పిల్‌వే 48 గేట్ల నుంచి 5,27,869 క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు తగ్గుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

తణుకులో భారీ వర్షం



తణుకులో కూలిన భారీ వృక్షం

తణుకు: తణుకు నియోజకవర్గంలో బుధవారం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డులో ప్రభుత్వాసుపత్రి వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెట్టు రోడ్డుపై కూలడంతో ట్రాఫిక్ స్తంభించింది. తణుకు మండలం కొమరవరంలో పిడుగుపాటుకు తాడిచెట్టు దగ్ధమైంది. ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగి పొర్లాయి.

బీఎల్ఓలతో సమీక్ష

తణుకు టౌన్: మండలంలోని దువ్వ గ్రామంలో బీఎల్ఓలతో బుధవారం జెడ్పీ సీఈఓ కె.రవికుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదులో డిలీషన్ ప్రక్రియపై బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, గ్రామ కార్యదర్శులకు సూచనలు ఇచ్చారు. అనంతరం క్షేత్రస్థాయిలో డిలీషన్ ప్రక్రియను, తణుకు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను బుధవారం జిల్లాపరిషత్ సీఈఓ కె.రవికుమార్ పరిశీలించారు. ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి నరసింహరావు ఆయన వెంట ఉన్నారు.

అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రో సరికొత్త చరిత్ర



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రో సరికొత్త చరిత్ర సృష్టించిందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. చంద్రయాన్-3 ప్రయోగాన్ని బుధవారం సాయంత్రం మండలంలోని ఇప్పలపాడు సమీపంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి ఆయన స్క్రీన్‌లో వీక్షించారు. ప్రయోగం విజయవంతమైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3పై ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని, తాను కూడా ఉత్కంఠగా ఎదురు చూశానన్నారు. అనుకున్న ప్రకారం చంద్రునిపై విక్రమ్ ల్యాండర్ కాలుమోపడంతో సాంకేతిక పురోభివృద్ధిలో భారతదేశం అగ్రస్థానంలో నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు చంద్రయాన్ ప్రయోగంపై వివరించారు. డీడీ పీఏస్ నాయుడు, ఏటీడబ్ల్యూఓ శ్రీవిద్య, ప్రిన్సిపాల్ బి.అమృతకుమార్ పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలకు సర్వం సిద్ధం

- ఎస్సై పోస్టుల భర్తీలో రెండో దశ పరీక్షలు
- రేపటి నుంచి ఏలూరులో నిర్వహణ
- రేంజ్ పరిధిలో 9,689 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

పరీక్షల తేదీలు ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 9 వరకు	
పరీక్షలకు హాజరు కానున్న అభ్యర్థులు	9,689
పురుష అభ్యర్థులు	8,247
మహిళా అభ్యర్థులు	1,442



ఏలూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో భారీగా పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఇప్పటికే సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి ప్రిలిమినరీ పరీక్షలు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో రెండో దశ పరీక్షలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 25 నుంచి వచ్చేనెల 9వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు పోలీస్ అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఫిజికల్ మేనేజ్‌మెంట్ (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పీఈటీ) పరీక్షలను నిర్వహిస్తారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

పరీక్షలకు సర్వం సిద్ధం

ఏలూరు రేంజ్ పరిధిలో 9,689 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 8,247 మంది పురుషులు, 1,442 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఈ పరీక్షలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఏదైనా ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఏర్పడితే ముందుస్తుగా వైద్య సేవలు అందించేలా పటిష్ట చర్యలు చేపట్టారు. పరుగు పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు మెటాలిక్ స్పైక్ షూలను వినియోగించకూడదనీ, ప్లాస్టిక్ స్పైక్ షూస్ మాత్రమే వాడాలని పోలీస్ అధికారులు సూచించారు.

పారదర్శకంగా ఎంపికలు

ఎస్సై పోస్టులకు దేహదారుఢ్య పరీక్షలు అత్యంత పారదర్శకంగా చేపట్టేలా పటిష్టమైన చర్యలు చేపట్టామని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతితో కలిసి ఆయన క్షుణ్ణంగా ప్రతి అంశాన్నీ పరిశీలించారు. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, నిజాయితీగా ఎంపికలు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు సైతం దళారుల మాటలు నమ్మవద్దని, ఎంపికలు పకడ్బందీగా చేపట్టేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతిభావంతులు, అర్హులు మాత్రమే ఎంపికవుతారనీ, మోసపోవద్దని సూచించారు. చిన్నపాటి లోపాలు కూడా లేకుండా ఎంపికలు ఉండాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆయనతోపాటు జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, ఏలూరు రేంజ్ కార్యాలయ మేనేజర్ నాగరాజు, పీఏ సాయిరాం, సీఐ బి.ఆదిప్రసాద్, రాంబాబు, డీఐజీ కార్యాలయ సిబ్బంది సతీష్, రత్నానంద్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

నిబంధనలు ఇలా..

ఎస్సై పోస్టుల ఎంపికలో ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణులై దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వీటిని కచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి సూచించారు. అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్, జిరాక్స్ కాపీలు తీసుకుని హాజరుకావాలని చెప్పారు.

- ఎస్ఎస్‌సీ మార్క్స్ లిస్ట్, ఇంటర్మీడియెట్ ఒరిజినల్ మార్క్స్ సర్టిఫికెట్లు.
- డిగ్రీ మార్క్స్ లిస్ట్, ప్రొవిజినల్ లేదా ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్.
- కమ్యూనిటీ సర్టిఫికెట్ లేటెస్ట్.
- క్రిమిలేయర్ సర్టిఫికెట్ (నోటిఫికేషన్ తేదీ అనంతరం తీసుకుని ఉండాలి).
- 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్లు.
- ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ సర్టిఫికెట్లు, ఏబీసీ, సర్వీస్ సర్టిఫికెట్లు.
- ట్రైబల్ ఒరిజినల్ సర్టిఫికెట్లు (ఏజెన్సీ ఏరియా).
- చిల్డ్రన్ ఆఫ్ పోలీస్ పర్సనల్, పోలీస్ మినిస్ట్రీయల్, చిల్డ్రన్ ఆఫ్ పర్సనల్.
- ఎక్స్ సర్వీస్‌మెన్, మెరిటోరియస్, స్పోర్ట్స్ కోటా.
- స్కోర్ కార్డు (ఒరిజినల్ రిజల్ట్).

-స్టేజ్-1, స్టేజ్-2 అప్లికేషన్లు.

పక్కాగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ అత్యంత పకడ్బందీగా చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం భీమవరం కలెక్టరేట్‌లో ఎలక్టోరల్ రోల్ అధికారులు, సహాయ ఎలక్టోరల్ రోల్ అధికారులతో ఆమె ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలో కనీసం 300 ఓటర్లు, అత్యధికంగా 1,500 ఓటర్లు మించి ఉండకూడదన్నారు. లంక గ్రామాల్లో ఉన్న ప్రజలు నది దాటి వచ్చే పరిస్థితి లేకుండా అక్కడే పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతంలో నాలుగు, గ్రామీణ ప్రాంతంలో రెండు పోలింగ్ స్టేషన్లకు మించకుండా ఒకే ప్రాంతంలో ఏర్పాటుకు అనుమతించవచ్చన్నారు. ఎలక్టోరల్ రోల్‌లో పొందుపరిచిన పోలీస్ స్టేషన్ పేరు క్షేత్రస్థాయిలో కూడా అదే పేరుతో ఉండాలన్నారు. సరిగ్గా కనిపించని (బ్లర్) ఫొటోలు, బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు స్థానంలో కొత్తగా కలర్ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలోని ఓటర్లు ఆ ఇంటిలో లేకుంటే, ఎక్కడ నివసిస్తున్నారో తెలియని పక్షంలో పోస్టల్ ద్వారా నోటీసు జారీ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ సర్వేయర్లను, పట్టణ ప్రాంతాల్లో ప్లానింగ్ సెక్రటరీలను వినియోగించుకోవాలని సూచించారు. రేషన్‌లైజేషన్ ప్రక్రియలో ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, ఆర్డీఓ దాసి రాజు, కలెక్టరేట్ ఏఓ అప్పారావు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన



దూడలను పరిశీలిస్తున్న జేడీ నెహ్రూబాబు

ద్వారకాతిరుమల: మండలంలోని వేంపాడు గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం లేగ దూడల ప్రదర్శనను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జి.నెహ్రూబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిపిన ప్రదర్శనకు రైతులు 47 లేగదూడలను తీసుకొచ్చారు. వీటిని నెహ్రూబాబుతో పాటు, పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రామచంద్రరావు, డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ జేసురత్నం, భీమడోలు ఏడీ డాక్టర్ సాయి రమేష్ పరిశీలించారు. మేలైన జాతి లక్షణాలు, సంపూర్ణ పోషణ కలిగిన మూడు దూడలను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపిక చేశారు. అనంతరం ఆ బహుమతులను వాటి రైతులకు అందించారు. అలాగే ఇందులో పాల్గొన్న ప్రతి రైతుకు ప్రోత్సాహక బహుమతితో పాటు, నట్టల నివారణా మందులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లేగదూడల పెంపకంపై అవగాహన, టీకాల గురించి వివరించారు. పాడి పశువులలో పెయ్యి దూడలు మాత్రమే పుట్టే వీర్య నాళికలు అందుబాటులోకి వచ్చాయని నెహ్రూబాబు తెలిపారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్, సర్పంచ్ రమేష్, పశుసంవర్ధకశాఖ ఏహెచ్ఏలు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

టంగుటూరి జీవితం ఆదర్శనీయం

కలెక్టర్ ప్రశాంతి



కలెక్టరేట్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



ఎస్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

భీమవరం (ప్రకాశంచౌక్): టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తి అందరికీ ఆదర్శం కావాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం భీమవరం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కలెక్టర్ ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి తదితరులు టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనం చేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1940–50వ దశకంలో ఆంధ్రా రాజకీయాల్లో ఆయన పాత్ర కీలకమైందని గుర్తుచేశారు. పేద కుటుంబంలో పుట్టి, ధనికుల ఇళ్లల్లో వారాలు చేసుకొని కష్టపడి చదువుకుని ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి కావడం గొప్ప విషయమన్నారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు, పోలీసు తూటాలకు గుండెనొగ్గిన సంగతులను వివరించారు. ప్రకాశం పంతులు ఇచ్చిన స్ఫూర్తి, ఆశయసాధన అందరికీ ఆదర్శం కావాలన్నారు. రాష్ట్రంలో విజయవాడ ప్రకాశం బ్యారేజీని, తిరుపతి వేంకటేశ్వర యూనివర్సిటీ వారి హయాంలోనే నిర్మాణం జరిగిందన్నారు. వారి వ్యక్తిత్వం ద్వారా స్ఫూర్తి పొందాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతులు త్యాగనిరతి, ఆశయాలు, వ్యక్తిత్వం ద్వారా స్ఫూర్తి పొందాలన్నారు. ప్రకాశం పంతులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కరువు కాటకాలు ఏర్పడినప్పుడు స్వయంగా పర్యటించి పరిస్థితులను చక్కదిద్దేందుకు కృషి చేశారన్నారు. తొలుత పలువురు విద్యార్థులు ప్రకాశం పంతులు జీవిత చరిత్ర, చేసిన సేవలపై ప్రసంగించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

సాక్షి, భీమవరం: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి ఎస్పీ యు.రవిప్రకాష్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమేగాక గొప్ప దేశభక్తుడు, మేధావి, ప్రజాసేవకుడని కొనియాడారు. 1953 అక్టోబర్ 1న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి సేవలు ప్రశంసనీయమన్నారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకులకెదురుగా నిబ్బరంగానిల్చి తెల్లదొరలను హడలెత్తించి ఆంధ్రకేసరిగా పేర్గాంచిన మహానుభావుడని కొనియాడారు. అడిషినల్ ఎస్పీ (అడ్మిన్) ఏవీ సుబ్బరాజు, ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, ఆర్ఐ వెంకట్రావు, ఏఓ రామ్మోహన్ పాల్గొన్నారు.



చంద్రయాన్ సంబరాలు

కోట్లాది మంది దేశ ప్రజల ఆకాంక్షగా ఉన్న చంద్రయాన్-3 విజయవంతం కావాలని దెందులూరు మండలం కొవ్వలి హైస్కూల్‌లో విద్యార్థులు బుధవారం వినూత్న ప్రదర్శన నిర్వహించారు. చంద్రయాన్-3 ఇంగ్లిష్ అక్షరాకృతిలో ఒదిగి జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. హెచ్ఎం ఎస్ఎన్ఎల్‌జీ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- దెందులూరు

‘నూజివీడుకు ఏం చేశాం’

- ఐదేళ్ల బాబు పాలనలో అభివృద్ధి శూన్యం
- మచ్చుకైనా ఒక్క శిలాఫలకం కూడా లేదు
- రాజధాని పేరుతో నూజివీడు సర్వనాశనం
- ఉమ్మడి పశ్చిమ అభివృద్ధికి పదుల సంఖ్యలో హామీలు
- తలలు పట్టుకుంటున్న జిల్లా తెలుగుదేశం నాయకులు
- నేటి నుంచి ఏలూరు జిల్లాలో లోకేష్ పాదయాత్ర



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ‘నూజివీడు రాజధాని పేరుతో ఇక్కడ ప్రజలను మోసం చేశాం.. మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని చెప్పాం.. మామిడి ఎగుమతులను ప్రోత్సహించి నూజివీడు రైతులకు ప్రపంచ ఖ్యాతి దక్కేలా చేస్తాం అన్నాం.. ఎడ్యుకేషన్, ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌లుగా మెట్ట ప్రాంతమైన నూజివీడును మారుస్తామని చెప్పాం.. ఇదంతా చంద్రబాబు జమానాలో పలుమార్లు ఇక్కడ జనాలకు మనం చెప్పిన మాటలు.. ఇప్పుడు కొత్తగా ఏం చెప్పాలి.. అసలు ఇక్కడేమైనా అభివృద్ధి చేశామా’ ఇది తెలుగుదేశం నేతలను వెంటాడుతున్న ప్రశ్న. రాకరాక తొలిసారిగా చినబాబు (లోకేష్) నియోజకవర్గానికి వస్తున్నప్పుడు మనం ఏమి చేశామో చెప్పకపోతే ఉన్న పరువు కాస్త గోవిందా అని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు తలలు పట్టుకుంటున్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర గురువారం మధ్యాహ్నానికి నూజివీడు నియోజకవర్గంలో ప్రారంభం కానుంది. ఈ క్రమంలో నూజివీడుకు ఫలానా పనిచేశామని, మచ్చుకైనా చెప్పుకోవడానికి ఏముందనే దానిపై టీడీపీ నాయకులు తర్జన భర్జనలు పడుతున్నారు.

తెలుగుదేశం.. వర్గ విభేదాలతో గందరగోళం

యువగళం పాదయాత్ర గురువారం నుంచి ఏలూరు జిల్లాలో ప్రారంభం కానుంది. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం నుంచి నూజివీడు నియోజకవర్గానికి పాదయాత్ర చేరనుంది. జిల్లాలోని నూజివీడు, చింతలపూడి నియోజకవర్గాల్లో యాత్ర నిర్వహించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. నూజివీడు నియోజకవర్గంలో వర్గ విభేదాలు, ఆధిపత్య ధోరణితో టీడీపీ నేతలు గందరగోళంలో ఉండగా ఇప్పుడు యాత్ర ప్రారంభం కానున్న క్రమంలో నూజివీడులో ఏం చేశామనే దానిపై చర్చ సాగుతుంది. ఐదేళ్ల పదవీ కాలంలో చంద్రబాబు మూడుసార్లు నూజివీడులో పర్యటించి మూడు మొక్కలు నాటడం తప్ప చేసిందేమీ లేదు. నూజివీడు మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని, పామాయిల్‌కు మంచి ధర వచ్చేలా చేస్తామని పలుమార్లు చెప్పి నూజివీడు రైతులను మోసం చేశారు.

రాజధాని పేరుతో మోసం

రాజధాని పేరుతో నూజివీడు ప్రజలకు ఆశలు కల్పించి రాజధానికి అనువైన ప్రాంతం, వేలాది ఎకరాల ప్రభుత్వ భూములున్నాయని నూజివీడులో పెడితే అద్భుతంగా ఉంటుందని దీనికి ప్రాధాన్యమిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ప్రకటించడంతో జనాలంతా నిజమని నమ్మి ఇక్కడ కోట్లు కుమ్మరించి భూములు కొన్నారు. కట్ చేస్తే.. రాజధానిని అమరావతిలో పెట్టి నూజివీడులో రియల్‌ఎస్టేట్‌ను సర్వనాశనం చేశారు. ఇద్దరు ముగ్గురు రియల్టర్లు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలూ ఉన్నాయి. మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని చింతలపూడి ఎత్తిపోతల పథకం నీరు నూజివీడుకు ఇస్తామని చెప్పారు. కనీసం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి. ఇది నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ చేసింది. ఇక నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు మాజీ ఏఎంసీ చైర్మన్ కాసా శ్రీనివాసరావుకు తారాస్థాయిలో విభేదాలు కొనసాగుతున్నాయి. పోటాపోటీ పాదయాత్రలు, సభలు నిర్వహిస్తున్నారు. చంద్రబాబు ఒకటి, రెండు పర్యాయాలు మందలించినా నేతల్లో సర్దుబాటు ధోరణి లేని పరిస్థితి. ఇన్ని గందరగోళాల నడుమ మూడు రోజులు లోకేష్ యాత్ర దశదిశ ఏంటో దిక్కు తోచడం లేదని పార్టీ నాయకులు, శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

నష్టపరిహారానికి ఆదేశం

వినియోగదారుల ఫోరం ఉత్తర్వులు

ఏలూరు టౌన్: ప్రయాణికుడికి అసౌకర్యం కలిగించినందుకు తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం రూ.10 వేలు నష్ట పరిహారంగా చెల్లించాలంటూ పశ్చిమగోదావరి జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు కోదండ రామ్మూర్తి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏలూరులోని వినియోగదారుల ఫోరం కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఫోరం తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరుకు చెందిన బీకేఎస్ఆర్ఐ అయ్యంగార్ గత నవంబర్‌లో హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చేందుకు తెలంగాణ ఆర్టీసీ బస్సు ఎక్కారు. మధ్యాహ్న భోజన విరామం కోసం బస్ డ్రైవర్ నల్గొండ జిల్లా నకిరేకల్‌లోని ఓ హోటల్ వద్ద ఆపారు. అక్కడ అయ్యంగార్ శీతల పానీయం కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా ఎమ్మార్పీకి మించి వసూలు చేశారు. అలాగే అక్కడ మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. దీనిపై ప్రశ్నించగా రెస్టారెంట్ నిర్వాహకులు దురుసుగా సమాధానం ఇచ్చారు. దీంతో అయ్యంగార్ ఏలూరు వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఫోరం అధ్యక్షుడు రామ్మూర్తి బస్సును అక్కడ నిలిపినందుకు బాధితుడు అయ్యంగార్‌కు రూ.10 వేలు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యానికి ఆదేశించారు.

క్లుప్తంగా

లారీ, పాల వ్యాన్ ఢీ



దొరసానిపాడు శివారులో ఢీకొన్న లారీ, వ్యాన్

ద్వారకాతిరుమల: దొరసానిపాడు శివారులో బుధవారం లారీ, పాల వ్యాను ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. భీమడోలు మండలం గుండుగొలను నుంచి తిరుమల పాల వ్యాను అశ్వారావుపేటకు వెళుతోంది. అలాగే కామవరపుకోట నుంచి తిమ్మాపురానికి ఒక లారీ వెళుతోంది. దొరసాని పాడు శివారు వద్దకు వచ్చేసరికి ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందు భాగం దెబ్బతినగా, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

చేపల మేత లారీ బోల్తా



ముదినేపల్లి రూరల్: ఉప్పరగూడెం వద్ద చేపల మేత లోడుతో వెళుతున్న ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలిలా ఉన్నాయి. ముదినేపల్లి నుంచి బంటుమిల్లి వెళుతున్న ఈ లారీ ఉప్పరగూడెం మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించే క్రమంలో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్ సురక్షితంగా లారీ నుంచి బయటపడ్డాడు.

మత్తు వైద్యులొచ్చారు

- తణుకు జిల్లా ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో మత్తు వైద్యుల నియామకం
- మంత్రి కారుమూరి చొరవతో శస్త్రచికిత్సల నిర్వహణకు మార్గం సుగమం



తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి పూర్తి స్థాయిలో మత్తు వైద్యులు అందుబాటులోకి వచ్చారు. గత మూడేళ్లుగా ఆస్పత్రిలో మత్తు వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేక వివిధ శస్త్రచికిత్సలకు సంబంధించి రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడేళ్ల క్రితం ఉన్న మత్తు వైద్యురాలు మరొక ప్రాంతానికి బదిలీపై వెళ్లడంతో ఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఉన్నతాధికారులు స్పందించి డిప్యుటేషన్‌పై ఒక వైద్యురాలిని నియమించారు. అయితే ఈ ఆస్పత్రిలో పని ఒత్తిడి అధికంగా ఉండటంతో ఇక్కడ విధుల్లో చేరేందుకు వెనుకంజ వేసేవారు. ఈ నేపథ్యంలో గత మూడేళ్లుగా డిప్యుటేషన్ వైద్యులపైనే ఆధారపడి శస్త్రచికిత్సలు జరిగేవి. సెలవు రోజుల్లో, రాత్రి సమయాల్లోను శస్త్రచికిత్సలకు ప్రైవేటు మత్తు వైద్యులను ఆస్పత్రికి పిలిపించి డబ్బులు చెల్లించి మరీ వైద్యసేవలందించేవారు. కానీ ఇప్పుడు పూర్తిస్థాయిలో మత్తు వైద్యులు డాక్టర్ భూపతిరాజు శ్రీనివాసరాజు బదిలీపై అందుబాటులోకి రాగా, డిప్యుటేషన్‌పై మరొక వైద్యురాలు పద్మజారాణి ఇద్దరూ విధుల్లో ఉండడంతో పూర్తి స్థాయిలో ఈ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

శస్త్రచికిత్స విభాగాలివే..

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గైనిక్ విభాగానికి ఎంతో మంచి పేరు ఉంది. 150 పడకలతో ఉన్న ఈ ఆస్పత్రికి నలుమూలల నుంచి ప్రసవాల కోసం గర్భిణులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రసవాల శస్త్రచికిత్సలతోపాటు జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ విభాగాల్లో కూడా నిత్యం రోజుకు 15కిపైగా వివిధ విభాగాల్లో శస్త్రచికిత్సలు చేస్తుంటారు. ఈ శస్త్రచికిత్సలన్నిటిలోను మత్తు వైద్యులు కీలకంగా వ్యవహరిస్తుంటారు. తాజాగా ఆస్పత్రిలో ఉన్న రెండు పోస్టులకు ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండడంతో మత్తువిభాగం సమస్య తొలగింది.

ఏ సమయంలోనైనా శస్త్రచికిత్సలకు సిద్ధం



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహించే శస్త్రచికిత్సలకు సంబంధించి మత్తు వైద్యుల పోస్టులు రెండు ఉన్నాయి. కొంతకాలంగా ఒక్క వైద్యురాలు మాత్రమే అందుబాటులో ఉండడంతో ఇబ్బందులు పడేవాళ్లం. ఈ కారణంగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చొరవ తీసుకుని ఎన్నోసార్లు కమిషనర్‌తో మాట్లాడి వైద్యుల పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయించారు. దీంతో ఇకపై ఏ సమయంలోనైనా శస్త్రచికిత్సలు నిర్వహించే వెసులుబాటు వచ్చింది.

– డాక్టర్ వెలగల అరుణ, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

క్రీడలతో మానసిక ఉల్లాసం

పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో క్రికెట్ నెట్ ప్రాక్టీస్ ప్రారంభం

ఏలూరు టౌన్: శాంతిభద్రతల పరిరక్షణకు నిత్యం తీవ్రమైన ఒత్తిడితో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బందితో కొద్దిసేపు క్రికెట్ ఆడుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ సిబ్బంది క్రికెట్ ప్రాక్టీస్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్‌ను ఆమె బుధవారం ప్రారంభించారు. పోలీస్ సిబ్బంది ఖాళీ సమయాల్లో క్రికెట్ ప్రాక్టీస్ చేసుకునేలా ఈ నెట్‌ను ఏర్పాటు చేశారు. కొద్దిసేపు సిబ్బందితో క్రికెట్ ఆడుతూ వారిలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ప్రజలకు ఉత్తమ సేవలు అందించటం, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిత్యం శ్రమిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో క్రీడల సాధనతో వారిలో మానసిక ఉల్లాసంతోపాటు, శారీరక దారుఢ్యం పెంపొందుతుందని చెప్పారు. క్రీడలపై ఆసక్తి చూపించే సిబ్బంది కొంత సమయాన్ని క్రీడలకు వెచ్చించటం ద్వారా ఒత్తిడి నుంచి దూరం కావచ్చన్నారు. ప్రతి రోజూ వ్యాయామం, యోగా, క్రీడలు ఆడటం ద్వారా రోగాలు దరిచేరకుండా కాపాడుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.శేఖర్, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, ఎస్బీ సీఐ ఎం.సుబ్బారావు, ఏలూరు టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



క్రికెట్ బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

శ్రీవారి కొండపై కారు హల్‌చల్

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై ఒక కారు బుధవారం సాయంత్రం హల్‌చల్ చేసింది. మద్యం మత్తులో ఉన్న ఆ కారు డ్రైవర్ తొలుత ఓ కారును, నిమ్మకాయలు అమ్మే మహిళను, ఆ తరువాత ఫుట్‌పాత్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మహిళ కాలికి తీవ్ర గాయమైంది. స్థానికుల కథనం ప్రకారం... శ్రీవారి కొండపై నుంచి వేగంగా కిందకు వస్తున్న ఇండికా కారు ఆలయ జంట గోపురాల ప్రాంతంలోని ఒక భక్తుడి కారును ఢీకొట్టి ఆగకుండా అదే ప్రాంతంలో నిమ్మకాయలు అమ్ముకుంటున్న కొమ్మర గ్రామానికి చెందిన మానుకొండ శేషమ్మ అనే మహిళను ఢీకొట్టింది. అనంతరం పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. అయితే ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు తెలుసుకున్న దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది అతడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. గాయపడిన మహిళ శేషమ్మకు దేవస్థానం ప్రథమ చికిత్సా కేంద్రంలో సిబ్బంది చికిత్స అందించారు.



శ్రీవారి కొండపై ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి నిలిచిన కారు

ఉరి వేసుకుని బీహార్ ఉద్యోగి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఓ మిల్క్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన సుబోత్ సింగ్ (40) మరో ఎనిమిది మందితో కలిసి పనుల కోసం ఏడాది క్రితం జంగారెడ్డిగూడెం వచ్చాడు. ఈ క్రమంలో స్థానిక శ్రీరామచంద్ర అగ్రి అండ్ మిల్క్ ప్రాడక్ట్స్‌లో ఉద్యోగం వచ్చింది. అయితే గత నాలుగు రోజులుగా ఉద్యోగానికి వెళ్లకుండా సుబోత్‌సింగ్ గదిలోనే ఉంటున్నాడు. మంగళవారం తోటివారు పనికి వెళ్లగా గదిలో దూలానికి నైలాన్‌తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం రాత్రి పని ముగించుకుని గదికి వచ్చిన వారు సుబోత్‌సింగ్ ఉరివేసుకుని ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు.

గడపగడపకు సంక్షేమం



ఆకివీడు : ఆకివీడు 20వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



తణుకు టౌన్ : తణుకు వెంకట్రాయపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్ అందించి సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

వాకింగ్ చేస్తూ గుండెపోటుతో కౌన్సిలర్ మృతి

నరసాపురం రూరల్ : నరసాపురంలో బుధవారం వేకువజామున వాకింగ్ చేస్తూ గుండెపోటుతో 16వ వార్డు కౌన్సిలర్ జయరాజ్ సింగ్ (67) మరణించారు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలసి నిత్యం స్థానిక వైఎన్ కళాశాలలో రోజువారి చేసే వాకింగ్‌లో భాగంగా నడుస్తూ ఉన్నట్టుండి ఒక్కసారిగా జయరాజ్‌సింగ్ కుప్పకూలిపోయారు. వెంటనే స్పందించిన ప్రసాదరాజు, ఆయన అనుచరులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయారు.

ప్రజలకు సేవలందించాలని..

జయరాజ్ సింగ్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నరసాపురం, ఏనుగువానిలంక, విజయవాడ పడమట, చీపురుపల్లి తదితర ప్రాంతాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. నరసాపురం మెయిన్ బ్రాంచిలో మేనేజర్‌గా పనిచేశారు. ఆయనకు భార్య సలోమి రాజకుమారి, కుమారులు సుజిత్, సరీన్ ఉన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం సేవాదృక్పథంతో పనిచేయాలనే తలంపుతో 16వ వార్డు కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అతి తక్కువ కాలంలోనే ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడిగా ఎదిగారు. వార్డులో సుపరిచిత నాయకుడిగా ఎదిగి ప్రజల మనసుల్లో నిలిచాడు. ఒక్కరోజు ముందు జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడా తమ వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గళం వినిపించిన ఆయన నవ్వుతూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఒక్కసారిగా విషాదం అలముకుంది. సింగ్ మృతికి సంఘీభావంగా వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. చీఫ్‌విప్ ప్రసాదరాజు జయరాజ్‌సింగ్ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, షేక్ బులిమస్తాన్, యేడిదకోట సత్యనారాయణ, కొత్తపల్లి నాని, భూసారపు జయ, చాగంటి మురళీకృష్ణ తదితరులు సింగ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



జయరాజ్‌సింగ్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



జయరాజ్ సింగ్ (ఫైల్)

లారీ ఢీకొని రైల్వే గేట్‌మెన్ మృతి

వీరవాసరం: బైక్‌పై వెళుతుండగా లారీ ఢీకొనడంతో రైల్వే గేట్‌మెన్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పాలకోడేరు మండలం వంకాయలపాలెం గ్రామానికి చెందిన మల్రివాడ తారక రామారావు (40) విస్సాకోడేరులో రైల్వే గేట్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం వ్యక్తిగత పనులపై విస్సాకోడేరు నుంచి బైక్‌పై రావులపాలెం వెళుతుండగా, వీరవాసరం సమీపంలోని జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి కింద పడి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే రామారావు మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై పి.రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రమేష్

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

వీరవాసరం: బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు అన్నారు. వీరవాసరం మండలం ఉత్తరపాలెంలో బుధవారం టీడీపీ, జనసేన నాయకులు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అమలవుతున్నాయన్నారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా నిలవడానికి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, గ్రామ సర్పంచ్ కోడె వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కోడే అప్పారావు, గొలగాని సత్యనారాయణ, కోడే వీరన్న, పిల్లి శ్రీను, మానుకొండ కాంతారావు, బొక్కా లక్ష్మి, బొక్కా సురేఖ, గూడూరి దుర్గాభవాని పాల్గొన్నారు.



ఉత్తరపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

ఇన్‌స్ట్రాగామ్‌లో వివాహితను వేధించిన యువకుడి అరెస్టు

తణుకు: ఇన్‌స్టాగామ్‌లో తణుకు పట్టణానికి చెందిన ఓ వివాహిత ఫొటోలు డౌన్‌లోడ్ చేసి మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బెదిరిస్తున్న ఓ ఆకతాయి యువకుడిని అరెస్టు చేసినట్లు తణుకు పట్టణ ఇన్‌చార్జి సీఐ సీహెచ్ ఆంజనేయులు బుధవారం చెప్పారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన సబ్బే అభిషేక్ లక్ష్మణ్ అలియాస్ అభిషేక్ తణుకు పట్టణానికి చెందిన ఓ వివాహితను ఇన్‌స్టాగామ్‌లో పరిచయం చేసుకుని ఆమె ఫొటోలు మార్ఫింగ్ చేసి మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో ఆమెతో పాటు ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ రవిప్రకాష్, తాడేపల్లిగూడెం డీఎస్పీ సి.శరత్‌రాజ్‌కుమార్ పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడు అభిషేక్‌ను అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. ఈ కేసులో సాంకేతికంగా ప్రతిభ చూపిన కానిస్టేబుళ్ల శివ, అప్పారావు, పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్‌లను ఎస్పీ అభినందించారు.

రైతుల అభివృద్ధికి పొగాకు బోర్డు కృషి

జంగారెడ్డిగూడెం: ఈ ఏడాది వర్జీనియాకు మంచి ధర లభించడంతో రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారని, రైతుల అభివృద్ధికి పొగాకు బోర్డు ఎల్లవేళలా కృషి చేస్తుందని పొగాకు బోర్డు ప్రొడక్షన్ మేనేజర్ డాక్టర్ కృష్ణశ్రీ అన్నారు. బుధవారం స్థానిక ఒకటో వేలం కేంద్రంలో వేలం ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాణ్యమైన పొగాకుకు ఎల్లప్పుడూ మంచి ధర లభిస్తుందని, ఇప్పటి కంటే ఎక్కువ ధర పొందాలంటే నాణ్యతలో రైతులు రాజీ పడవద్దని సూచించారు. పొగాకు బోర్డు నుంచి ఎటువంటి సహాయం కావాలన్నా అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. రీజనల్ మేనేజర్ ఆదిశేషు మాట్లాడుతూ ఈ ఏడాది లభించిన ధరలను చూసి రైతులు పోటీ పడి పొలం కౌలు, బ్యారన్ అద్దెలు పెంచుకోవద్దని సూచించారు. బోర్డు నిర్దేశించిన కోటా మేరకు మాత్రమే పొగాకును పండిస్తే మార్కెట్‌లో ఎప్పుడూ మంచి ధర లభిస్తుందన్నారు. రైతులు ఎప్పుడూ క్రమశిక్షణతో నాణ్యతతో కూడిన పొగాకు పండించాలన్నారు. వేలం అధికారి బి.శ్రీహరి, ఎస్‌జీవో సుధీర్‌లు మాట్లాడుతూ వేలం సజావుగా జరగడానికి సహకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథి డాక్టర్ కృష్ణశ్రీని, వేలం అధికారులను, బయ్యర్లను రైతులు దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. రైతు సంఘం అధ్యక్షులు పరిమి రాంబాబు, ఉపాధ్యక్షులు వామిశెట్టి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం వేలం కేంద్రంలో డాక్టర్ కృష్ణశ్రీని సత్కరిస్తున్న రైతులు

రూ.313.58 కోట్ల పొగాకు అమ్మకాలు

స్థానిక 1వ పొగాకు వేలం కేంద్రంలో బుధవారం వర్జీనియా వేలం ప్రక్రియ ముగిసింది. మొత్తం 1,27,28,457 కిలోల పొగాకును రైతులు వేలం ద్వారా అమ్ముకున్నారు. అత్యధికంగా కేజీకి గరిష్ఠ ధర రూ.287 లభించగా, కనిష్ఠ ధర రూ.170 లభించినట్లు వేలం అధికారి బి.శ్రీహరి తెలిపారు. మొత్తం రూ.313.58 కోట్ల విలువ చేసే పొగాకును రైతులు వేలం ద్వారా అమ్ముకున్నారు. కాగా సరాసరి ధర రూ.246.36 లభించగా, గత ఏడాది రూ.191.40 లభించింది. అలాగే కేజీకి సరాసరి ధర ఈ ఏడాది రూ.50 అదనంగా లభించింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాసితుల త్యాగఫలితమే పోలవరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకుండా నిర్వీర్యం చేసి నిర్వాసితులను గోదావరిలో ముంచారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఏలూరు జిల్లాలో బుధవారం ప్రవేశించింది. నగరంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక టుబాకో మర్చంట్ కల్యాణ మండపం వరకు పాదయాత్ర చేశారు. అనంతరం పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. నిర్వాసితుల త్యాగఫలితమే పోలవరం ప్రాజెక్టు అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ప్రతి ఏడాది రూ.15 వేల కోట్లు కేటాయిస్తే నాలుగేళ్లలో నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు, ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేదన్నారు. 1.06 లక్షల కుటుంబాల నిర్వాసితులు ఉంటే కేవలం 20 వేల కుటుంబాలకే నష్టపరిహారం చెల్లిస్తామనడం దుర్మార్గం అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు మోదీ శనిలా దాపురించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు కేవలం 22 శాతం మాత్రమే పరిష్కారం లభించిందన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ, మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడారు.



ఏలూరు రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

క్లుప్తంగా

వరిపై నల్లి తెగులు



నందమూరులో నిర్వహించిన పొలంబడి కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో వరిపై నల్లి తెగులు కనిపిస్తుందని, దీని నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని జగన్నాథపురం, మాధవరం, ఆరుగొలను, నందమూరు, ఆరుళ్ళ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నల్లి తెగులు నివారణకు సూచనలు చేశారు. ప్రొపినోఫాష్, క్లోరోపైరిఫాస్ 50 శాతం ఎక్కువగా పిచికారి చేస్తే వరిపై దోమపోటు ఎక్కువగా రావడానికి అనువుగా తయారవుతుందన్నారు. రాబోయే రోజుల్లో దోమ ఉధృతికి కారణమవుతుందన్నారు. అనంతరం నందమూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ సత్యనారాయణ, రైతులు అడపా దానయ్య, వెంకటేశ్వరరావు, వీర్లపాటి సత్యనారాయణ, శ్రీరాములు వెంకటేశ్వరరావు, అరసాల రాము, ఆర్‌బీకే ఇన్‌చార్జ్ జాలపర్తి సతీష్, ఏఈవో మాధవ వర్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై బీజేపీ నాయకుల హర్షం



పట్టణంలో సెంట్ ఆన్స్ విద్యా సంస్థలో చంద్రయాన్-3 ల్యాండింగ్ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రుని ఉపరితలంపై దిగడం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని సెంట్ ఆన్స్ విద్యా సంస్థలో చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో భారత్ మరో సువర్ణ అధ్యాయాన్ని లిఖించిందన్నారు. దీంతో ప్రతీ భారతీయుడి హృదయం విజయగర్వంతో ఉప్పొంగి పోయిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, శాస్త్రవేత్తలకు బీజేపీ నాయకులు నార్ని తాతాజీ, ఈతకోట తాతాజీ, నరిశే సోమేశ్వరరావు, స్కూలు అధినేత అద్దంకి విజయకుమార్‌లు అభినందనలు తెలిపారు.

మంత్రి కారుమూరి పరామర్శ



ఇరగవరంలో సీతారామయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: మండలంలోని ఇరగవరం గ్రామానికి చెందిన వీరవల్లి సీతారామయ్య కుటుంబాన్ని బుధవారం పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పరామర్శించారు. ఇరగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు వీరవల్లి సీతారామయ్య భార్య అన్నవరం ఇటీవల మృతి చెందడం జరిగింది. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంచి కార్యకర్తను పార్టీ కోల్పోయిందన్నారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పి పార్టీ తరుపున అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఇరగవరం పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు రాజేంద్రప్రసాద్, నాయకులు కుడిపుడి సత్యనారాయణ, వీరవల్లి యుగంధర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం- పల్లపు ప్రాంతాలు మునక



పెంటపాడు బేసిక్‌స్కూల్ గ్రాండ్‌లో వర్షం నీరు నిలిచిన దృశ్యం

పెంటపాడు: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని బుధవారం కురిసిన వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో బుధవారం ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పెంటపాడు పరిసర ప్రాంతాల్లోని లోతట్టు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూల్ గ్రౌండ్ వర్షంతో నిండింది. మరో రెండ్రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

హెల్మెట్ లేదా.. వాహనం కదలదు

- ఇకపై శిరస్త్రాణం లేనివారిపై చర్యలు
- సత్ఫలితాలు ఇస్తున్న పోలీసుల శిబిరాలు



హెల్మెట్ వాడకంపై వాహనదారులకు ప్రత్తిపాడు హైవే వద్ద అవగాహన కల్పిస్తున్న గూడెం రూరల్ సీఐ ఎస్వీఎస్ మూర్తి (ఫైల్)



పెంటపాడు వంతెన వద్ద ట్రాఫిక్ నిబంధనలో భాగంగా హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న గూడెం ట్రాఫిక్ ఎస్సై సుబ్రహ్మణ్యం

పెంటపాడు: జిల్లాలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోయింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు అధికం కావడంతో ఈ ప్రమాదాలు మరిన్ని జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల వల్ల చాలా మంది ప్రాణాలు పోగొట్టుకొంటున్నారు. ఇందులో అత్యధికంగా యువత ఎక్కువగా చనిపోతున్నారు. ఈ రోడ్డు ప్రమాదాల సరళిని గమనిస్తే చాలామంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం లేదు. మృతులందరూ ఈ తరహా కోవలోకి వస్తున్నారని పోలీసులు కూడా గుర్తించారు. 80 శాతం ప్రమాదాల్లో తలకు గాయాల వల్లే ఎక్కువ మంది మరణిస్తున్నారు. ఈ మరణాలకు అడ్డుకట్ట వేయాలంటే హెల్మెట్ ధరించడం ఒక్కటే పరిష్కారం. ఇప్పటికే జాతీయ రహదారి భద్రత సంస్థ ఈ విషయాన్ని స్పష్టంగా తెలిపింది. దీనిని వాహనచోదకులు సీరియస్‌గా పరిగణించడంలేదు. ఇటీవల వరుస ప్రమాదాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ రవిప్రకాష్ ఈ అంశం పై ఫోకస్ పెట్టారు. హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ ఆయన ఆదేశాలు ఇప్పటికే జారీ చేసారు. ఈ నిబంధన గట్టిగా అమలు చేసేందుకు పోలీసులు సన్నద్ధమయ్యారు. కాగా వాహనదారులు అప్పటికప్పుడు సమీపంలో అమ్ముకొంటున్న హెల్మెట్‌ను కొనుగోలు చేసుకొని ప్రయాణాలు చేస్తున్నారు. ప్రతీ నిత్యం గూడెం ట్రాఫిక్ ఐలండ్ సెంటర్, ముదునూరుపాడు చర్చి, గూడెం బైపాస్‌రోడ్డు, నిట్ కళాశాల, ప్రత్తిపాడు వై.జంక్షన్, తదితర ప్రాంతాల్లో పోలీసులు హెల్మెట్‌పై అవగాహన కోసం పహారా కాస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

శిక్ష ఇలా.....

హెల్మెట్ ధరించని వారిని ఆపి జరిమానా వేయడం పాత విధానం. ఇకపై అలా వాహనం నడిపి పోలీసులకు పట్టుబడితే వాహనాన్ని పోలీసులు తమ అధీనంలోకి తీసుకొంటారు. హెల్మెట్ కొనుగోలు చేసి ధరించేలా ప్రోత్సహిస్తారు. హెల్మెట్ కొనుగోలు చేసి తీసుకొచ్చిన తరువాతే తమ వాహనాన్ని తిరిగి ఇస్తారు. దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి.

మన భద్రతకే అని గ్రహించాలి



హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రమాదంలో పడితే కుటుంబసభ్యుల పరిస్థితి గురించి వాహనదారులు తప్పక ఆలోచించాలి. మన నిర్లక్ష్యం కుటుంబానికి శిక్ష కాకూడదు. ప్రమాదాల నివారణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరి చేశాయి. ఇక నుంచి హెల్మెట్ ధరించకపోతే చర్యలు తప్పవు.

– వాసంశెట్టి సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ ఎస్సై తాడేపల్లిగూడెం

తప్పనిసరిగా హెల్మెట్ వాడాలి



రోడ్డు ప్రమాదాలు పరిశీలిస్తే ఎక్కువ సంఘటనలలో తలకు గాయాల వల్లే మృత్యువాత పడుతున్నారు. జిల్లా ఎస్పీ రవిప్రకాష్, ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. అందరూ ఆచరిస్తే ప్రమాదాల సంఖ్య తగ్గించవచ్చు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుంది.

– ఎస్‌వీవీఎస్ మూర్తి, తాడేపల్లిగూడెం రూరల్ సీఐ

పట్టణానికి చేరుకున్న బలుసులమ్మ రథం



బలుసులమ్మ అమ్మవారి రథానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : గ్రామ దేవత బలుసులమ్మ అమ్మవారి ఉత్సవాల ఊరేగింపుకు తయారు చేయించిన రథం బుధవారం రాత్రి ఆలయానికి చేరుకుంది. ప్రత్యేక వాహనంపై ఈ రథాన్ని అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బలుసుమ్మ అమ్మవారి ఆలయం వద్ద రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువనేత కొట్టువిశాల్, ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, కర్రి భాస్కరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు వెలనాటి సత్తిబాబు, పెదప్రోలు భాస్కరాచార్యులు, గుంటుబోయిన రామస్వామి, అప్పన్న రమేష్‌కుమార్, గారపాటి వీరకుమార్, ఆకుల ధనశేఖర్, ఆలపాటి కాశి, ఆలయ అర్చకులు వెలవలపల్లి ప్రదీప్‌శర్మ, వెలవలపల్లి గోపినాథ్‌శర్మ, బాదంపూడి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

26న అలంపురంలో ఆసుపత్రి భవనం ప్రారంభం



అలంపురంలో ఉచిత ఆసుపత్రికి సంబంధించి వివరాలు వెల్లడిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

పెంటపాడు: అలంపురం వెంకటరమణ సేవాచారిటీ ఉచిత ఆసుపత్రి ద్వారా రోగులకు అందిస్తున్న సేవలు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజు కోరారు. బుధవారం ఆయన స్థానిక ఆసుపత్రి వద్ద విలేకర్లతో మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా ట్రస్టు ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలతో పాటు, ఉచిత వైద్యసేవలు నిరంతరాయంగా అందిస్తున్నామన్నారు. ఈనెల 26న ఆసుపత్రికి అనుసంధానంగా మరో నూతన ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కొలనువాడ వెంకట హనుమ సత్యనారాయణరాజు, దెందుకూరి వెంకట శ్రీహర్ష, కొలనువాడ వెంకట శివరామరాజు, కొలనువాడ రామచంద్రరాజు, కొలనువాడ గోవిందరాజు, కొలనువాడ రవి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

26న అలంపురంలో మెగా వైద్య శిబిరం

పెంటపాడు మండలం అలంపురం వెంకటరమణ సేవా చారిటీ ఆసుపత్రిలో ఈనెల 26న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించబోయే ఈ శిబిరం కోసం పలు ప్రాంతాలకు బస్సులు ఏర్పాటు చేసామన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం అర్బన్: సెప్టెంబర్ 9 జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ కె. జ్యోతి అన్నారు. భీమవరం మండలంలోని బేతపూడిలోని సచివాలయం వద్ద బుధవారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ లాయర్ కె. జ్యోతి మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న సివిల్ తాగాదాలు, పోలీస్ కేసులు, మోటార్ వెహికల్ ప్రమాద బీమాకు సంబంధించిన కేసులు, మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు ఎన్నో కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

టంగుటూరి చిరస్మరణీయుడు



తణుకులో ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు



పెదతాడేపల్లి గాయత్రీ కళ్యాణ మండపంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి దృశ్యం



పెంటపాడులో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



వెంకట్రామన్నగూడెం ఉద్యాన వర్సిటీలో మాట్లాడుతున్న వీసీ డా.టి.జానకీరామ్

తణుకు అర్బన్: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో బుధవారం తణుకులో ప్రకాశం పంతులుకు ఘన నివాళులందాయి. ఈ సందర్భంగా తణుకు వైఎస్సార్ పార్కులో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ న్యాయవాదిగా, ఉద్యమకారుడిగా ప్రజలకు ఎన్నో సేవలు అందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పైబోయిన ఏసుబాబు, మణికంఠ రెడ్డి, రేలంగి రాంబాబు, ఎస్‌వీ జాకబ్‌బాబు, ములగాల శ్రీనివాస్, పుల్లెపు సూర్యచంద్రరావు, కాకరపర్తి ఆంజనేయులు, షేక్ ఖాదర్ జిలానీ పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో...

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ జాన్ లిల్లీ, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ పుష్పాల రాజరాజేశ్వరి, డాక్టర్ గౌతమి, ఉద్యోగులు లక్ష్మీనరసింహ, నాగేంద్ర, నర్సులు పాల్గొన్నారు.

టంగుటూరి జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

ఇరగవరం: మండలంలోని ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల ఎంపీపీ కొప్పశెట్టి అలివేలు మంగతాయారు ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. టంగుటూరి పోరాట పటిమను అందరు అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దొమ్మేటి శ్రీనివాసు, ఇంచార్జీ ఎంపిడీఓ రంగమ్మ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పీవీఎస్ఎన్ మూర్తి, ఎన్ఆర్‌జిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరిని ఆదర్శంగా తీసుకోవాలి

అత్తిలి: ఆంధ్రకేశరి టంగుటూరి ప్రకాశం పంతులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. బుధవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం దత్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం బీద స్థితిలో విద్యను అభ్యసించి అంచెలంచెలుగా ఎదిగి బారిష్టరు చదివి న్యాయవాది అయ్యాడని, రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా చేసి న్యాయంగా ప్రవర్తించాడన్నారు. ఆయన సంపాదించిన ఆస్తిమొత్తం దానం చేసి బీదవాడయ్యాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రథమ సహాయకుడు బాలసుబ్రహ్మణ్యం, ఎస్ పురుషోత్తం, ఆత్మలింగం, శ్రీనివాసరావు, రాంబాబు, కృష్ణారెడ్డి, శ్రీహర్షద్ తదితరులు పాల్గొన్నారు.

పెదతాడేపల్లిలో ప్రకాశం పంతులు జయంతి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి గాయత్రీ కళ్యాణ మండపంలో బుధవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వం పంపిన సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా మద్రాస్‌లో పోలీసు తూటాలకు ప్రాణాలు లెక్కచేయకుండా ఎదురువెళ్లిన ఆంధ్రకేసరి ధైర్య సాహసాలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం కోశాధికారి ప్రవా శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శిగరికపాటి బాపయ్య శర్మ, కలిగొట్ల శ్రీనివాస్, రౌతుల రాజా, వారణాసి దత్తాత్రేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు చిరస్మరణీయం

పెంటపాడు: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలు మరువలేనివని పెంటపాడు మండల అభివృద్ధి అధికారి సీహెచ్ బాలాజీ పేర్కొన్నారు. టంగుటూరి జయంతి పురస్కరించుకొని బుధవారం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. స్వాంతంత్ర్య సమరయోధుడిగా, ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణయక పాత్ర పోషించి చెన్నై సైమన్ కమిషన్ ఎదురుగా తుపాకికి గుండె చూపించి ఆంధ్రకేసరిగా పేరుగాంచిన టంగుటూరి సదా చిరస్మరణీయుడన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యాలయ సూపరింటెండెంట్ టీవీ సత్యనారాయణ, ఉపాధి కార్యాలయ ఉద్యోగులతో పాటు, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ సహాయకులు భూషణం తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యానికై అలుపెరుగని పోరాటం చేసిన టంగుటూరి

తాడేపల్లిగూడెం రూరల్: స్వాతంత్ర్యానికి అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ జానకీరామ్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు కుటుంబం నుంచి వచ్చిన గాయని సూర్యకుమారి, విజయ్‌చందర్‌లు సమాజానికి ఎంతో సేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటి రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డీన్‌లు ఎస్.పద్మావతమ్మ, నారం నాయుడు, డీవీ.స్వామి, శశికళ, ఎన్.సూర్యకుమారి, ఎంవి.మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి జీవితం స్ఫూర్తిదాయకం

తణుకు టౌన్: ఆంధ్ర కేసరిగా గుర్తింపు పొందిన టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్రులు గర్వించగదిన గొప్ప దేశభక్తుడు అని వెంకట్రాయపురం పాఠశాల హెచ్ఎం పెదపాటి గోపాలకృష్ణ ప్రసాద్ చెప్పారు. బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ అమ్మాజీ, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో నాలుగు దశాబ్దాల అభివృద్ధి

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- వెంకట్రాయపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



తణుకు వెంకట్రాయపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: కేవలం నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిపాలనలో 40 సంవత్సరాల అభివృద్ధి జరిగిందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం తణుకు పట్టణంలోని 16వ వార్డు వెంకట్రాయపురంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. జోరు వానలోనూ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు పొందిన ప్రతీ కుటుంబం మళ్లీ జగనే రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరిందని, దీనితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రతీ ఒక కుటుంబంలో సభ్యునిగా మారిపోయారని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలన్నీ ఎవరూ పొందేవారో తెలియదని, ఈప్రభుత్వంలో మాత్రం ప్రతీ ఒక్కరికీ ఏదో పథకంలో లబ్ధి పొందుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 18 వేల మంది పేదలకు సొంతింటి కల సాకారం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వార్డులోని సమస్యలను మంత్రి కారుమూరి దృష్టికి తీసుకురావడంతో ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వార్డు నాయకులు యల్లమిల్లి రమేష్ బాబు, టీ వరప్రసాద్, యూ శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, అడ్డాల అనంత బాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, మహిళా అధ్యక్షురాలు నూకల కనకదుర్గ, కన్వీనర్‌లు పేకేటి విజయలక్ష్మీ, ములగాల శ్రీను, కుడిపూడి చంద్రరావు, రేలంగి రాంబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపంతో రక్తహీనత

సాక్షి, భీమవరం: మహిళల్లో ఎక్కువగా పౌష్టికాహార లోపాలు, రక్తహీనత కనబడుతున్నాయని వాటిని అధికమించేందుకు ఆరోగ్య విషయంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ బీహెచ్ శ్వేత చెప్పారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా అధ్యాపకులు, విద్యార్థినులకు హెల్త్ స్క్రీనింగ్ ఫర్ ఉమెన్ ఏ కంప్లీట్ బ్లడ్ ప్రొఫైల్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శ్వేత మాట్లాడుతూ తమ పరిశీలనలో 95 శాతం మంది మహిళల్లో పౌష్టికాహార లోపాలు గమనించామన్నారు.

విద్య ద్వారానే సమాజం అభివృద్ధి

వీరవాసరం: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. వీరవాసరం యానాదుల కాలనీలో విద్యార్థులకు బుధవారం ఉచితంగా సైకిల్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించి వారికి ఉచితంగా ఏడు సైకిళ్లు, పాఠశాలకు ఎల్‌సీడీ టీవీ అందజేసిన ఆర్డీఓ దాసిరాజుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆర్డీవో దాసిరాజు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సూచించిన మార్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు ఆర్డీఓ దాసి రాజు– సౌజన్య దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం సుందర్రాజు, ప్రధానోపాధ్యాయుడు జె శ్రీనివాసు, గెడ్డం భాస్కరరావు, సుధాకర్, సత్యనారాయణ, ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆచంద్ర తారార్కం ఈ మహిళల కీర్తి

'ఇస్రో'లో పనిచేసిన తొలి తరం మహిళా శాస్త్రవేత్తల మాటల్లో తరచు వినిపించే మాట... 'ఆరోజుల్లో ఇస్రోలో చా...లా తక్కువ మంది మహిళలు ఉండేవారు'
చంద్రయాన్-3కి సంబంధించి నిన్నటి ప్రత్యక్ష ప్రసారాన్ని గమనిస్తే... ఆ ప్రాజెక్ట్‌లో భాగమైన ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉత్సాహంగా కనిపిస్తారు.
మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. అది సంఖ్యాబలమే కాదు సామర్థ్య బలం కూడా. 'ఇస్రో' సాధించిన ఎన్నో విజయాలలో మహిళా శాస్త్రవేత్తలు భాగం అయ్యారు. ముఖ్యంగా 'చంద్రయాన్-3' ప్రాజెక్ట్‌లో రీతూ కరిధాల్ నుంచి కల్పనా కాళహస్తి వరకు ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు మేధోశ్రమ చేశారు. చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నారు.
'ఇస్రో సైంటిస్ట్ కావాలనుకుంటున్నాను' అని కలలు కనే ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చే అసాధారణ విజయ గాథలు ఇవి.

రాకెట్ ఉమన్: రీతూ కరిధాల్



అన్ని దశలను పూర్తి చేసుకొని విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన క్షణం ఒక చారిత్రక సందర్భం. ఎంత కృషి చేస్తే ఒక విజయం సొంతం అవుతుందో చెప్పిన సందర్భం.

అమోఘమైన చారిత్రక విజయాన్ని దేశానికి అందించిన 'చంద్రయాన్-3'లో భాగమైన అనేకమంది మహిళలలో రీతు కరిధాల్ ఒకరు.

గత నెలలో...

మూడు దశలను పూర్తి చేసుకొని చంద్రయాన్-3 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి దూసుకెళ్లిన తరువాత ఉత్తర్‌ప్రదేశ్‌లో లక్నోలోని ఒక ఇంట్లో ఆనందం అంబరాన్ని తాకింది. వారు ఆనందంతో బాణాసంచా కాల్చారు. మిఠాయిలను చుట్టుపక్కల వారికి పంచారు. ఇక నిన్నటి రోజు ఆ ఆనందం స్థాయి ఎల్లలు దాటి ఉండవచ్చు. ఇది కోట్లాదిమంది భారతీయుల ఇంట్లో కనిపించే సాధారణ దృశ్యమే కావచ్చు.

కాని ఆ ఇంటికి ఒక ప్రత్యేకత ఉంది.

ఆ ఇంట్లో పుట్టిన రీతూ కరిధాల్ ప్రసిద్ధ చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రీతుకు ఆకాశం అంటే అంతులేని ఆసక్తి. అదేపనిగా నింగిలోకి చూసేది. ఏవేవో ఊహించుకునేది. అప్పటికి అవి శాస్త్రీయతకు నిలవని ఊహలు కావచ్చు. అయితే రీతూ కరిధాల్ శాస్త్రీయ రంగంలో దిగ్గజంగా వెలగడానికి ఉపకరించిన ఊహలు.

కట్ చేస్తే....

1997... భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లోకి అడుగు పెట్టింది రీతు. చంద్రుడిపై అడుగు పెట్టినంత ఆనందంగా అనిపించింది. 'ఇస్రో' గురించి వింటూ, చదువుతూ పెరిగిన రీతు అదే 'ఇస్రో'లో 'మిషన్ ఎనాలసిస్ డివిజన్'లో ఉద్యోగిగా చేరింది. అప్పట్లో 'ఇస్రో'లో తక్కువ మంది మహిళలు పనిచేసేవారు.

ఎక్కడికి వెళ్లినా ఒంటరిగానే వెళ్లేది. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది.

అయినా సరే, ఎప్పుడూ భయపడేది కాదు.

అసలు సిసలు భయం మాత్రం తొలి టాస్క్ రూపంలో ఎదురైంది.

'నేను చేయగలనా?' అని మొదట ఆందోళన పడింది రీతు.

చేతులెత్తేయడం తేలిక. 'చేయగలను' అనుకోవడం కష్టం. అయితే కష్టపడే వారే విజేతలవుతారు.'యస్ నేను చేయగలను' అంటూ తొలి టాస్కును విజయవంతంగా పూర్తి చేసి 'భేష్' అనిపించుకుంది.

'నాకు అప్పగించిన టాస్క్‌ను సీనియర్‌లు చేసే అవకాశం ఉన్నప్పటికీ నన్ను వెదుక్కుంటూ వచ్చింది. ఇది నన్ను పరీక్షించడానికి వచ్చిందా? అదృష్టవశాత్తు వచ్చిందా? అనేది తెలియదుగానీ నా విజయానికి కారణం... ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ చదువుకున్నాననే ధైర్యం కంటే నాపై నాకు ఉన్న ఆత్మవిశ్వాసం' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది రీతు.

ఆ ఆత్మవిశ్వాసం అప్పుడే కాదు ఇప్పటికీ రీతు వెన్నంటే ఉంది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రతిష్ఠాత్మకమైన 'మంగళయాన్ మిషన్'లో డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా పనిచేయడానికి ఇంధనంగా మారింది. చంద్రయాన్-3తో రీతూ కరిధాల్ ఒక చారిత్రక విజయంలో భాగం అయింది.

శాస్త్రవేత్తలు కావాలనుకునే కలలు కనే అమ్మాయిలకు రీతు కరిధాల్ స్ఫూర్తి ఇస్తుంది.

'నా విజయ మంత్రం ఇది' అని ఆమె ఎప్పుడూ ప్రత్యేకంగా చెప్పలేదుగానీ పరోక్షంగా వినిపించే మాట...టైమ్ మేనేజ్‌మెంట్.

కాలం విలువ తెలిసిన వారే 'టైమ్ మేనేజ్‌మెంట్'ను ఇష్టంగా ఆచరిస్తారు. ఆ ఆచరణే ఎన్నో విజయాలను బహుమానంగా ఇస్తుంది.

స్ఫూర్తిదాయక శక్తిమంతులు



మహిళా శాస్త్రవేత్తలు, సిబ్బంది వేడుక

స్పేస్ మిషన్‌లలో భాగమైన మహిళా శాస్త్రవేత్తల గురించి మిన్నీ వేద్ 'దోజ్ మాగ్నిఫిసియెంట్ ఉమెన్ అండ్ దెయిర్ స్టోరీస్' అనే స్ఫూర్తియదాయకమైన పుస్తకాన్ని రాసింది. ఈ పుస్తకంలో 'రాకెట్ ఉమెన్'గా పేరు గాంచిన రీతూ కరిధాల్ సక్సెస్ స్టోరీ కూడా ఉంది. 'కుటుంబ జీవితం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాను. వృత్తిపరమైన విజయాలకు కుటుంబమే పెద్ద బలం' అంటుంది రీతు.

'ఇస్రో'లో రీతులాగే ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉన్నతస్థానాల్లో ఉన్నారు. అయితే ఇది రాత్రికి రాత్రి వచ్చిన విజయం కాదని వారి ప్రయాణాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. 'ఇస్రో'లో పనిచేయాలని అనుకోవడానికి కారణం నుంచి... ఎదుర్కొన్న ఒత్తిళ్ల వరకు వారి మాటల్లో కనిపిస్తాయి.

ఇస్రో స్పేస్ సైన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పని చేసిన సీతా సోమసుందరం ఇలా అంటోంది...

'నేను ఇస్రోలో చేరిన కాలంలో ఇంజనీరింగ్, సైన్స్‌లలో మహిళలు చాలా తక్కువ మంది ఉండేవాళ్లు. కొందరు సీనియర్‌లకు కొన్ని అభిప్రాయాలు ఉండేవి. అందులో ఒకటి... మహిళలు ఎక్కువగా కష్టపడలేరు. పరిమిత పని గంటల్లోనే పనిచేయగలరు. ఇంటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అంకితభావం ఉండదు. అయితే ఇది తప్పుడు భావన అని ఇస్రోలో ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు నిరూపించారు'. 'ఏదో ఉద్యోగం చేస్తున్నాను అనే భావన కాకుండా విజయంలో భాగం కావాలనే సంకల్ప బలం మహిళా శాస్త్రవేత్తలలో కనిపిస్తుంది. ఎన్నో విజయాలలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషించారు. డెడ్ లైన్‌లను సవాలుగా తీసుకోవడం నుంచి మిషన్, నేవిగేషన్, కమ్యూనికేషన్, కంట్రోల్ సిస్టమ్, స్పేస్ క్రాఫ్ట్ డిజైన్, ట్రాకింగ్ లాంటి మేజర్ ఏరియాలలో కీలక పాత్ర పోషించి తమ సత్తా చాటారు' అంటుంది మంగళయాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన ఎస్.అరుణ. స్పేస్ సైంటిస్ట్‌లు అనగానే ఏవో గంభీరమైన ఊహలు తారసపడతాయి. అయితే ఈ ఉమెన్ స్పేస్ సైంటిస్ట్‌ల మాటలు విన్న తరువాత 'అందరిలాగే సాధారణ జీవితం... కానీ అసాధారణ సంకల్ప బలం' అనే సత్యం ఆవిష్కారం అవుతుంది. 'ఇస్రోకు చైర్ ఉమన్ (చైర్ పర్సన్) ఎప్పుడూ?' అనే ప్రశ్న వస్తుంటుంది. 'ఇస్రో' విజయాలలో భాగం అవుతున్న మహిళల అంకితభావాన్ని చూస్తే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదు' అనిపిస్తుంది. 'ఇస్రో'లో జెండర్-న్యూట్రల్ ప్రొఫెషనల్ ఎన్విరాన్‌మెంట్ ఉంటుందనే మంచి మాటలు కూడా దీనికి కారణం.

కొన్నిసార్లు లోతైన భావాలు పలకడానికి పదాలు, పుస్తకాలు తెల్లముఖం వేస్తాయి. కళ్లు మాత్రమే నిశ్శబ్దంగా చెబుతాయి. చంద్రయాన్-3 ల్యాండింగ్‌కు సంబంధించి నిన్నటి టీవీ ప్రత్యక్ష ప్రసారంలో మహిళా శాస్త్రవేత్తల కళ్లలో కనిపించిన ఉత్సాహాన్ని, అంకితభావాన్ని గమనిస్తే ఇంకా ఎన్నో విజయాలు వారి కోసం ఎదురు చూస్తున్నాయని అనిపిస్తుంది.

సంతోష క్షణాలు: కల్పనా కాళహస్తి



కల్పనా కాళహస్తిది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా. చెన్నైలో బి.టెక్ (ఈసీఈ) చదివారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి. తల్లి గృహిణి. ఇస్రోలో పనిచేయాలని తన చిన్ననాటి నుంచి కలలు కనేది. అనుకున్నట్టుగానే 2000 సంవత్సరంలో ఇస్రోలో చేరారు. తొలుత శ్రీహరికోటలో ఐదేళ్లు పనిచేశాక బెంగళూరులోని శాటిలైట్ సెంటర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కరోనా పాండమిక్ సమయంలో అనేక అవాంతరాలు వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ 'చంద్రయాన్-3' మిషన్‌లో అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె గతంలో చంద్రయాన్-2, మంగళయాన్ ప్రాజెక్టుల్లోనూ కీలక బాధ్యతల్ని నెరవేర్చారు. ఆమె నైపుణ్యం, అంకితభావం, దూరదృష్టి వంటివి మిషన్ విజయవంతం కావడంతో గణనీయంగా తోడ్పడ్డాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇవి చాలా సంతోషభరితమైన క్షణాలుగా ఎప్పటికీ ఉండిపోతాయి. చంద్రయాన్ 2 కాలం నుంచి లభ్యమైన ఎన్నో అనుభవాలతో ఈ మిషన్‌ను లోప రహితంగా రూపొందించాం అని చెప్పారు.

వినిపించే గొంతుక: పి.మాధురి



శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ స్టేషన్ నుంచి ప్రజలకు బయటికి కనపడే అక్కడి సిబ్బంది/ సైంటిస్టుల్లో పిల్లల మాధురి ఒకరు. ఈమె షార్‌లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రాకెట్ లాంచింగ్ సమయంలో వినిపించే వ్యాఖ్యానాలు, ప్రజలకు వివరించే అంకాల గొంతుక ఆమెదే.

వీళ్లే కాకుండా చంద్రయాన్-3 మిషన్‌లో మొత్తం 54 మంది మహిళా సైంటిస్టులు / ఉద్యోగులు / సిబ్బంది ఉన్నారు. వీళ్లలో చాలా మంది మహిళలు ఎంతో కీలకమైన బాధ్యతలు నెరవేర్చే డిప్యూటీ డైరెక్టర్ స్థాయి నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్ స్థాయి నుంచి అనేక స్థాయుల్లో పనిచేస్తూ... కీలకమైన, భారత్‌కు గర్వకారణమైన ఈ ప్రాజెక్టును విజయవంతం చేశారు.

సౌమ్యంగా సాధించింది



సౌమ్య ఈ తరం టెకీ. సాంకేతికతను ఆరోగ్యానికి అద్దింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో కొత్త ఒరవడి తెచ్చింది.

వైద్యరంగం, ఔషధాల తయారీ రంగాలు సాంకేతికతను అందుకోవాల్సినంత వేగంగా అందుకోవడం లేదనుకుంది సౌమ్య. 'మల్టిప్‌లెయిర్ ఏఐ' పేరుతో హెల్త్‌కేర్ రంగంలో ప్రవేశించింది. ఇంత సునిశితమైన, సంక్లిష్టమైన పరిశ్రమను నిర్వహించడం మగవాళ్లకే సాధ్యం అనే అభిప్రాయాన్ని చెరిపేసిందామె. 'మగవాళ్ల ప్రపంచం అనే భావన మహిళలు ప్రవేశించేటంత వరకే. ఒకసారి మహిళలు ప్రవేశిస్తే ఇక అది అపోహ మాత్రమేనని నిర్ధారణకు వచ్చేస్తాం. మా టీమ్ లో సగానికి పైగా మహిళలే. సేల్స్ విభాగంలో కూడా మహిళలు సమర్థంగా పని చేస్తున్నార'ని చెప్పింది. ఒక టెకీ హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి దారితీసిన పరిస్థితులను, హైదరాబాద్‌లో సంస్థ స్థాపించి సక్సెస్ అందుకున్న వైనాన్ని సాక్షితో పంచుకున్నారు సౌమ్య.



సౌమ్య

భారీ మూల్యం చెల్లించాం

''నన్ను హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి రప్పించిన కారణాలు అత్యంత బాధాకరమైనవి. మాది ఉత్తరప్రదేశ్, ప్రయాగరాజ్ (అలహాబాద్). నాన్న రవిప్రకాశ్ శ్రీవాస్తవ ఐఏఎస్ ఆఫీసర్. నాన్న డయాబెటిస్‌తో బాధపడుతుండేవారు. రొటీన్ టెస్ట్‌లు, మెడికేషన్ ఇవ్వడంలో ఎక్కడో పొరపాటు జరిగిపోయింది. మా జీవితాలు భారీ మూల్యం చెల్లించుకున్న పొరపాటు అది. వైద్యుల నిర్లక్ష్యం, రాంగ్ మెడికేషన్ కారణంగా ఆయన హటాత్తుగా ప్రాణాలు వదిలారు. నేనప్పుడు బీటెక్ సెకండియర్‌లో ఉన్నాను. ఆ తర్వాత కొద్దిసంవత్సరాల్లోనే అమ్మకు ఒవేరియన్ క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. మేము తెలుసుకునేటప్పటికే వ్యాధి మూడవ దశకు చేరింది. చికిత్స మొదలు పెట్టినప్పటికీ ఆరు నెలలకే అమ్మను కూడా కోల్పోయాను. అలాంటి దయనీయమైన పరిస్థితుల్లోనే బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీలో బయోటెక్నాలజీలో మాస్టర్స్ చేశాను. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ వైద్యరంగం ఆ వేగాన్ని అందిపుచ్చుకోవడంలో వెనకబడుతోంది. ఆ వెనుకబాటు తెచ్చిన నష్టంలో మా అమ్మానాన్నల మరణాలు కూడా భాగమేననిపించింది. ఈ రెండు రంగాల మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయాలనే సంకల్పం కలిగింది, చేయగలననే నమ్మకం కూడా. సమాచారలోపం తలెత్తని విధంగా మెడికల్ డాటాను పరిరక్షించగలిగే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకున్నాను. మల్టిప్‌లెయిర్ ఏఐ స్థాపించి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా డాటా అనలైజేషన్, డాటా మెయింటెయిన్ చేస్తున్నాం. మా సంస్థకు 'ఐఎస్‌ఓ 27001' సర్టిఫికేట్ వచ్చింది. మా సర్వీస్‌ను దేశవిదేశాల్లో పెద్ద ఆరోగ్య సంస్థలు తీసుకుంటున్నాయి. పేషెంట్ కేర్‌లో మొదటిది పేషెంట్ ఆరోగ్య చరిత్ర, క్రమం తప్పని పరీక్షల ద్వారా వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, పరీక్షల నివేదికల నిర్వహణ ప్రధానమైనవి. ఇక్కడ పొరపాటు జరిగితే ప్రాణాలు దక్కవని చెప్పడానికి మా పేరెంట్సే ఉదాహరణ.

ఫాలో అప్ సర్వీస్

వ్యాధి నిర్ధారణ ఆధారంగా వైద్యం అందించిన తర్వాత తదనంతర పరీక్షలను, వైద్యాన్ని అందించాల్సిన సమయానికి ఫాలో అప్ చేయడం కూడా మా సర్వీస్‌లో భాగంగా ఉంది. అలాగే భవిష్యత్తులో టెలిమెడిసిన్ విస్తరించాల్సిన అవసరం ఉంది. వైద్యచికిత్సను కుగ్రామాలకు చేరడానికి చక్కటి మాధ్యమం ఇది. పేషెంట్‌ను ఉన్న చోటనే ఉంచి ఆరోగ్యపరిస్థితిని మానిటర్ చేయడం సాధ్యమవుతుంది. నేను చదివిన టెక్, బయోటెక్ పరిజ్ఞానం ఇందుకు దోహదం చేసింది. నాకు సవాళ్లు ఎదురయ్యాయా అంటే సవాళ్లు లేని ప్రొఫెషన్ అంటూ ఏదైనా ఉంటుందా? డిజిటల్ బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవరోధాలు వచ్చాయి. మా క్లయింట్ల సందేహాలను తీరుస్తూ, వాళ్లు సమాధానపడే వరకు సహనంగా వివరించాం. సవాళ్లకు సమాధానాలు వెతుక్కుంటూ ముందుకు పోవడమే సక్సెస్‌కు దారి తీస్తుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మా నాన్నను కోల్పోవడమే నన్ను ఈ రంగం వైపు నడిపించింది. ప్రతి విజయంలో మా అమ్మానాన్న కనిపిస్తున్నారు'' అని వివరించారు సౌమ్య.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అందంగా పెంచుకుందాం!

బ్యూటిప్స్





గోళ్లు..పొడవుగా అందంగా ఉండే ఉండాలని ప్రతి అమ్మాయి కోరుకుంటుంది. కానీ కొందరిలో కొద్దిగా పెరగగానే విరిగిపోతుంటాయి. కొంతమందికి అసలు పెరగవు. దీంతో నెయిల్ పెయింట్ వేసుకోవాలంటే ఇబ్బంది. గోళ్లను చక్కగా పెంచే ఈ ఐదు చిట్కాలు పాటించి చూడండి మీ కోరిక తీరుతుంది..

- గోళ్ల పెరుగుదలను ప్రోత్సహించడంలో ఆలివ్ ఆయిల్ ముందుంటుంది. దీనిలోని విటమిన్ ఇ గోళ్లకు పోషణ అందించి చక్కగా పెరిగేలా చేస్తుంది. రాత్రి పడుకోబోయే ముందు కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను గోళ్లమీద రాసి మర్దన చేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల గోళ్లకు రక్తప్రసరణ చక్కగా జరిగి గోళ్లలో పెరుగుదల కనిపిస్తుంది.
- టీస్పూను యాపిల్ సైడర్ వెనిగర్‌లో టీస్పూను వెల్లుల్లి తరుగు వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గోళ్లపై రాసి పదినిమిషాల తరువాత కడిగేయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే గోళ్లు విరగకుండా చక్కగా పెరుగుతాయి.
- వెల్లుల్లి రెబ్బను రెండు ముక్కలు చేసి గోళ్లపై పదినిమిషాలపాటు రుద్దాలి. కొద్దిరోజుల్లోనే గోళ్ల పెరుగుదల కనిపిస్తుంది.
- ఆరెంజ్ జ్యూస్‌ను గోళ్లకు పూతలా అప్లైచేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది గోళ్లను అందంగా పెరిగేలా చేస్తుంది.
- ఇవన్నీ చేయలేకపోతే కొబ్బరినూనెను గోళ్లపై రాసి రోజూ మర్దన చేయాలి. కొబ్బరినూనెలోని ఫ్యాటీ ఆమ్లాలు, ఇతర పోషకాలు గోళ్ల పెరుగుదలకు దోహదపడతాయి.

ఇంటిప్స్







- ఒక్కో నిమ్మకాయను అల్యూమినియం ఫాయిల్‌లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.
- శాండ్ విచ్ మరీ మెత్తగా కాకుండా చక్కగా రావాలంటే... శాండ్ విచ్‌లో పెట్టే కూరగాయలు, బ్రెడ్ మయనేజ్, చీజ్ గది ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి. ఇంతకు మించి వేడిగా ఉండే తేమ చేరి శాండ్ విచ్ మెత్తగా మారిపోతుంది.
- కొన్నిసార్లు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత గట్టిగా మారుతుంటాయి. ఇలాంటప్పుడు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత చల్లని నీటిలో ఐదు నుంచి పదినిమిషాలు ఉంచాలి. తరువాత కూరలో వేస్తే పన్నీర్ ముక్క మృదువుగా, మెత్తగా ఉంటుంది.

అబద్ధాలను నమ్ముతున్నారా?!

సైబర్ టాక్



ప్రతీకాత్మక చిత్రం

నిజం నిలబడి ఉండగానే అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందంటారు.. ఈ సామెత సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా పుట్టుకువచ్చే ఫేక్‌న్యూస్ విషయంలో సరిగ్గా సరిపోలుతుంది. ఈ ఫేక్ న్యూస్ వల్ల నిజమేదో తెలుసుకోవడం కష్టంగా మారింది. అబద్ధాన్ని నిజం అనుకునే ప్రమాదమూ ఉంటోంది. అలాగే.. ఫొటోలు, వీడియోలు కూడా ఫేక్‌వి పుట్టుకొస్తున్నాయి. లైవ్ వీడియోలోనూ ఇటీవల ఏఐ టెక్నాలజీ ద్వారా అబద్ధం కొత్తగా సోషల్‌మీడియాను ఏలుతోంది. నిజమేంటో తెలుసుకోవడానికి మనం చాలా ప్రయత్నాలు చేయాల్సి ఉంటోంది. ఎందుకంటే, అబద్ధాల వల్ల కలిగే మోసాలు ఎన్నో. వాటి బారిన పడకుండా జాగ్రత్త పడాలంటే ముందుగా నిజాలేమిటో తెలుసుకుందాం...

వార్తలకు సంబంధించిన సమాచారం, డేటా, నివేదికలు పూర్తిగా నిజమైనవి కానివి ప్రజల ముందుకు వస్తున్నాయి. అందుకని, మూలాధారాలు లేకుండా వచ్చిన సమాచారం అవాస్తవం అని గ్రహించాలి. అబద్ధపు వార్తలు విస్తృతంగా షేర్ అవుతుంటాయి. వీటికి ఎలాంటి సెన్సార్‌షిప్ ఉండదు.

నకిలీ వార్తల పుట్టుకకు..

తమకు తెలిసిన విషయాన్ని నలుగురికి తెలియజేయాలనే ఆత్రుత. స్వీయ లాభం, రాజకీయ ప్రభావం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయి. కేవలం తమకు తెలిసినవి మరికొందరికి తెలియజేద్దామని నిజానిజాలు తెలుసుకోకుండా కొందరు అదేపనిగా షేర్ చేస్తుంటారు. సమాచారం అబద్ధమే కావచ్చు కానీ, దానిని షేర్ చేసే వ్యక్తి అది నిజమని నమ్ముతారు. తప్పుడు సమాచారం అని తెలిసీ ఉద్దేశపూర్వకంగానే షేర్ చేస్తారు. ఏదైనా సమస్యకు లేదా వ్యక్తికి సంబంధించిన కంటెంట్ అబద్ధమైతే మనల్ని ఆ వార్త తప్పుదారి పట్టించవచ్చు. ముఖ్యాంశాలు, విజువల్స్, క్యాప్షన్‌లు కంటెంట్‌కు సరిపోని విధంగా ఉంటాయి. మోసగించడానికి ఫొటోలు, కంటెంట్‌ను తారుమారు చేస్తుంటారు.

తనిఖీ చేసే విధానం..

- వీడియో మూలం ఎక్కడ ఉందో చెక్ చేయాలి. అది విశ్వసనీయమైనదే అని నిర్ధారించుకోవడానికి ప్రయత్నించాలి.
- సమాచారం నిజమైనదైనా ప్రత్యామ్నాయంగా ఇతర మూలాధారాల కోసం వెతకాలి.
- వీడియోలో అసహజమైన కదలికలు ఉన్నాయేమో గమనించాలి.
- డీప్ ఫేక్స్ గుర్తించడానికి 'డీప్ ఫేక్ డిటెక్షన్ మోడల్' వంటి స్పెషల్ సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంది.
- వీడియోలోని సంఘటనలు నమ్మదగినవేనా? ఆ వీడియో ఏ సందర్భాన్ని బట్టి తీశారో ఆ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.
- వీడియోలో ఉన్న వ్యక్తిని మెయిల్, ఫోన్ ద్వారా సంప్రదించి, ప్రామాణికతను ధృవీకరించుకోవడానికి ప్రయత్నించవచ్చు.

వాస్తవం తెలుసుకోవాలంటే..

- గూగుల్ రివర్స్ ఇమేజ్ చెక్ చేయాలి. లేదా ఫొటో వెరిఫికేషన్ కోసం www.tineye.comని ఉపయోగించాలి.
- ఫొటో లేదా వీడియో (https://www.invid-project.eu/tools-and-services/invid-verification-plugin/) కోసం ఇన్‌విడ్ టూల్‌కిట్ ఎక్స్‌టెన్షన్‌ని ఇన్‌స్టాల్ చేయాలి.
- ఫార్వర్డ్ చేసే ముందు ఏదైనా ఒక అంతర్జాతీయ ఫాక్ట్-చెకింగ్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్‌తో www.factly.in వాస్తవాన్ని చెక్ చేయాలి.

ఇలా గుర్తించాలి...

డీప్ ఫేక్ వీడియో లేదా ఆడియోలో ఏవైనా లోపాలు ఉన్నాయేమో జాగ్రత్తగా పరిశీలించడం, వినడం చేయాలి.

- డీప్ ఫేక్ వీడియో లేదా ఫొటోలలో లైటింగ్ నీడలను చెక్ చేయాలి. కొన్నింటిలో నీడలు కచ్చితంగా కనిపించకపోవచ్చు. ఇవే కాకుండా ఇంకేమైనా లోపాలు ఉన్నాయేమో చెక్ చేయాలి.
- వీడియోలలోని బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయాలి. సబ్జెక్ట్‌కు వీడియోలోని వ్యక్తుల కదలికల సరిపోలకపోవచ్చు. అంటే, ఏఐ టెక్నాలజీ ద్వారా నకిలీ వ్యక్తుల సృష్టి అయి ఉండవచ్చు.
- వీడియోలో వ్యక్తి కనురెప్పలు ఆర్పుతున్నారో లేదో పరిశీలించాలి.
- లైవ్ వీడియోలో మాట్లాడుతున్నప్పుడు ముఖాన్ని ఎడమ లేదా కుడికి కదిలించమని సదరు వ్యక్తిని ఉద్దేశించి అడగాలి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్